గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు పిల్లి.ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పండిత విల్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పనులులేక ఇల్లు గడవక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ధరలు పెంపు ఉందన్నారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మేరీ లక్ష్మి, సరసమ్మ, భూలక్ష్మి, వరలక్ష్మి, సుగుణ సీత పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

బతుకు కూల్చారు..!

ఎస్ఆర్ నగర్లో కూల్చివేసిన ఇల్లు

46 ఇళ్లు నేలమట్టం చేసిన అధికార యంత్రాంగం

62 మందికి పట్టాలిచ్చినా కోర్టు కేసుతోపాటు నివాసయోగ్యంగా లేని స్థలాలు

మరో 53 మందికి అసలు ఇళ్ల స్థలాలే లేవు

శిథిలాల మధ్యే గడుపుతున్న బాధితులు

ఎస్ఆర్ నగర్వాసుల ఆవేదన వర్ణనాతీతం

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు ఎస్ఆర్ నగర్ నిరుపేదల బతుకులు కూలిపోయాయి. కోటి ఆశల మధ్య సాగుతున్న జీవిత ప్రయాణంలో ఊహించని కుదుపు వారి జీవనాన్ని అతలాకుతలం చేసింది. కాయ కష్టం చేసుకుని ఉన్నదంతా ఊడ్చిపెట్టి అపురూపంగా నిర్మించుకున్న ఇళ్లు కళ్లముందే కూలిపోతుంటే కన్నీరు కారుస్తూ తల్లడిల్లిపోయారు. 46 ఇళ్లు నిర్దాక్షిణ్యంగా కూలగొట్టడంతో రాత్రంతా శిథిలాల మధ్య కంటిమీద కునుకు లేకుండా రోధించిన తీరు వర్ణనాతీతం. సొంతింటి కల చెదిరిపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా తట్టా బుట్టా పట్టుకుని ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్తుండడంతో అందరి హృదయాలు చలించిపోయాయి.

పాలకోడేరు శివారున వామపక్ష పార్టీల పోరాట ఫలితంగా 1986లో రాజ్ కాలువ గట్టుకు చేర్చి అల్లూరి సీతారామరాజు నగర్ (ఎస్ఆర్ నగర్) ఏర్పాటైంది. అప్పట్లో వామపక్ష పార్టీలతో ఉన్న సిపిఎం, సిపిఐ అనేక పోరాటాలు చేసి నిరుపేదలకు స్థలాలు ఇప్పించి నివాసాలు ఏర్పాటు చేశాయి. కాలక్రమేణా నిరుపేదలు వాటిని ఇళ్లుగా విస్తరించుకున్నారు. సుమారు 108 కుటుంబాలు ఇక్కడే నివసిస్తున్నాయి. వారంతా నిరుపేదలు కావడంతో రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఉన్నదంతా ఖర్చు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఈ భూమిని నమ్ముకుని ఇంటిళ్లపాది జీవనం సాగిస్తున్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో పాలకోడేరులో ఏర్పాటు చేసిన రెండు ప్రభుత్వ కాలనీల్లో 62 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో తొమ్మిది పట్టాలకు సంబంధించి భూమి కోర్టు వివాదంలో ఉంది. మిగిలిన 53 మందికి అసలు ఇళ్ల పట్టాలు లేవు.

అయితే ప్రభుత్వ లేఅవుట్ పూడికతీతకు పూర్తిస్థాయిలో నోచుకోవడంతో నివాసానికి యోగ్యంగా లేదు. ఈ నేపథ్యంలో నివాసాలు కూడా అరకొరగానే చేసుకున్నారు. 14 మంది ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. స్లాబ్ దశలో ఒక ఇల్లు, ఇటుకలు కట్టుబడి దశలో 2 ఇళ్లు, స్తంభాల దశలో ఒకటి, పునాది దశలో ఒకటి, షీట్ బీములు దశలో ఒకటి, బోర్లు దశలో ఒకటి ఉన్నాయి. 62 మందికి ప్రభుత్వం పట్టాలిస్తే కేవలం 14 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. ఏడుగురికి సంబంధించిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు 48 మంది ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వ లేఅవుట్లో ఉన్న స్థలం కోర్టు వివాదంలో ఉండడం, మరో లేఅవుట్లో కనీసం పూడికతీత కూడా జరక్కపోవడంతో నివాసాలకు యోగ్యంగా లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లేఅవుట్కు వెళ్లే అవకాశం లేక ఎస్ఆర్ నగర్లో ఉండిపోయారు. అయితే కాలువ కబ్జాలు, అభివృద్ధి పేరుతో ఇళ్లు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టిన నేపథ్యంలో 53 మంది కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు దీనిపై స్టే విధించింది. అయితే శనివారం బుల్డోజర్లతో భారీ పోలీసులు మోహరించి మిగిలిన గృహాలు తొలగించేందుకు చర్యలు చేపట్టడంతో సిపిఎం నేతలు, నిరుపేదలు ప్రతిఘటించారు. వెనక్కి తగ్గిన పోలీసులు, అధికారులు సమస్యను పరిష్కరించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని నమ్మబలికి ఆదివారం తెల్లవారుజామున సిపిఎం నేతలను గృహనిర్బంధం చేసి మోసం చేశారు. మూడు బుల్డోజర్లు, వంద మందికి పైగా పోలీసులు ప్రత్యేక బలగాలు మోహరించి ఇంట్లో ఉన్నవారిని బయటికి పిలిచి విద్యుత్ కనెక్షన్లు కట్ చేసి భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా ఖాళీ చేయించి 46 ఇళ్లను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారు. 62 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తే దీనిలో 9 పట్టాలు కోర్టు కేసులో ఉంటే కేవలం 14 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే 46 ఇళ్లను అన్యాయంగా తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. మిగిలిన వారంతా ఎక్కడ నివాసం ఉండాలో తెలియక రాత్రంతా శిథిలాల మధ్యే గడిపారు. కటిక చీకటిలో పాముల భయంతో వృద్ధులు, చిన్నారులతో దోమల మధ్య నరకయాతన అనుభవించారు. తెల్లవార్లూ కంటిమీద కునుకు లేకుండా కన్నీరు మున్నీరుగా రోదించిన తీరు అందర్నీ కలిచివేసింది.

అన్యాయంగా కూల్చేశారు ..

మల్లుల పద్మ, ఎఎస్ఆర్ నగర్ ప్రాంత వాసి

ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాం. 2020లో ఇళ్ల పట్టా ఇచ్చారు. అప్పట్లో భూమి పూడిక పనులు చేయలేదు. ఇల్లు నిర్మించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. ఏం చేయాలో అర్థంగాక మా దగ్గర ఉన్నదంతా ఊర్చి మరికొంత అప్పుచేసి ప్లీట్ బీములు వేశాం. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇల్లు నిర్మించుకునేందుకు డబ్బు లేక ఇక్కడే నివాసం ఉంటున్నాం. అన్యాయంగా ఇల్లు కూల్చేశారు. నాకు ఇల్లు లేదని చెప్పినా వినలేదు.

ఎక్కడికెళ్లాలో అర్థం కావట్లేదు..

మల్లుల వెంకటలక్ష్మి, ఎఎస్ఆర్ నగర్ ప్రాంత వాసి

ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నారు. తినీతినక రూపాయి రూపాయి కూడబెట్టి ఇల్లు ఏర్పాటు చేసుకున్నాం. ప్రభుత్వం ఇళ్ల స్థలం కూడా ఇవ్వలేదు. ఉన్న ఇంటిని కూల్చేస్తే ఎక్కడికి వెళ్లాలో అర్థం కావట్లేదు. ఇంటిని నిర్దాక్షిణ్యంగా కూలదోశారు. అసలు మమ్మల్ని మనుషులుగా గుర్తించట్లేదు.

ఇంత దారుణం ఎక్కడా చూడలేదు..

ఎం.సత్యనారాయణ, ఎఎస్ఆర్ నగర్ ప్రాంతవాసి

40 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. అప్పటి నుంచి లేని ఇబ్బంది ఇప్పుడు ఏమొచ్చిందో తెలియడం లేదు. ఇష్టపడి ఓట్లు వేసి గెలిపిస్తే మాకు సరైన గుణపాఠం జరిగింది. ఇన్నేళ్లలో ఇంత దారుణం ఎక్కడా చూడలేదు. ఉన్న ఇంటిని తొలగిస్తే ఎక్కడికి వెళ్లి బతకాలి. కనీసం ఆలోచన చేయకుండా ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం దారుణం.

పేదల ఇళ్ల తొలగింపులో జిల్లా యంత్రాంగం ప్రేక్షక పాత్ర

జెఎన్వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉండి నియోజకవర్గంలో నిరుపేదల ఇళ్లు తొలగిస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. ఒక ప్రయివేటు వ్యక్తి ఆదేశాలిస్తుంటే అధికార యంత్రాంగం పనిచేయడం సిగ్గుచేటు. అసలు జిల్లా కేంద్రంలో జిల్లా యంత్రాంగం పనిచేస్తుందో లేదో కూడా అర్థం కాని పరిస్థితి. కాలుష్యం పేరుతో భూస్వాములకు లబ్ధి చేకూరుస్తున్నారు. ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు. ఇదే భూమిని ఆక్రమించుకుని వ్యవసాయం చేసుకుంటూ కొబ్బరి చెట్ల ద్వారా ఫలసాయం పొందుతున్న భూస్వాముల ఆక్రమణలు తొలగించరు. నోటీసులు ఇవ్వరు. పేదలకు అన్యాయం భూస్వాములకు న్యాయం చేయడం దారుణం. రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపి ఇళ్లు పోగొట్టుకున్న బాధితులకు అండగా నిలవాలి. ఇళ్ల తొలగింపు లాభసాటి బిజినెస్గా మారింది.

నేడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటన



ఉండి నియోజకవర్గంలో మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పర్యటించనున్నారు. ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో బుల్డోజర్లతో దుర్మార్గంగా ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్ల కూల్చివేత పర్వం కొనసాగుతోంది. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎటువంటి ఆశ్రయం లేకుండా నిరాశతో ఉన్న బాధితులను పరామర్శించేందుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలతో కూడిన బృందం పర్యటించనుంది. ఈ పర్యటనలో బాధితులను స్వయంగా కలిసి వారి సమస్యలు, ఆవేదనను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి. గోపాలన్ ఒక ప్రకటనలో తెలిపారు.

పేదల ఇళ్లు కూల్చివేతపై నిరసనలు

వీరవాసరంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

ముఖ్యమంత్రి పుట్టినరోజు కానుకగా పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్లో ఇళ్లు కూల్చి వేయించి ఉండి ఎంఎల్ఎ చంద్రబాబుకు బహుమతిగా ఇచ్చారని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. పాలకోడేరులో ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా సోమవారం వీరవాసరం బస్టాండ్ సెంటర్లో సిపిఎం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. ఎంఎల్ఎ అండ చూసుకుని పోలీసులు మహిళల పట్ల మానవత్వం లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. ఉండి ఎంఎల్ఎను అదుపు చేస్తారా, పేదలపైకి ఇలానే వదిలేస్తారా అన్నది ముఖ్యమంత్రి తేల్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు, ఎ.బాబూరావు, యాళ్లబండి నారాయణమూర్తి, యండమూరి సుబ్బారావు, కిలాడి సత్యనారాయణ, బాలం విజయకుమార్, జుత్తిగ శ్రీనివాస్, శ్యాంబాబు, కె.పెద్దిరాజు పాల్గొనారు.

తాడేపల్లిగూడెం : పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్లో పేదల ఇళ్ల తొలగింపు ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ ఐ ల్యాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్లు కూలగొట్టడం చాలా దారుణమన్నారు. కూల్చివేతలు ఆపాలని సిపిఎం నాయకులు జిల్లా అధికారులను బతిమాలినా ఫలితం లేదన్నారు. కూటమి బుల్డోజర్ రాజకీయాలు ఆపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, పోలా చంద్రశేఖర్, అడపా లోవ, నర్మాల నారాయణరావు, వెంకట దుర్గారావు,నాగేంద్రబాబు పాల్గొన్నారు.

తణుకు: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయ కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయ కుమారి మాట్లాడుతూ ఎంఎల్ఎ రఘు రామ కృష్ణంరాజు పేదలపై బుల్డోజర్లతో దాడి చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ఇళ్ల కూల్చివేతలు ఆపాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గార రంగారావు, గుబ్బల గోపి, వెంకటేశ్వరరావు, బ్రహ్మాజీ, రామకృష్ణ, త్రిమూర్తులు, రమేష్, నాగరత్నం, శ్రీనివాస్రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలు తక్షణం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జిల్లా నలుమూలలా ఫిర్యాదుదారుల నుంచి పంచాయతీ, రెవెన్యూ, భూ సమస్యలు, సర్వే, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, డిఆర్డిఎ, ఐసిడిఎస్, వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించి 237 అర్జీలు స్వీకరించారు. అందిన ప్రతి ఒక్క అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్సి గోపీమూర్తికి సత్కారం

గోపీమూర్తిని సత్కరిస్తున్న శ్రీకృష్ణ దేవరాయ కళా పరిషత్ సభ్యులు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజా సమస్యల పట్ల తక్షణం స్పందిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్సి బి.గోపీమూర్తి అన్నారు. రాయకుదురు వచ్చిన సందర్భంగా ఆయనను శ్రీకృష్ణదేవరాయ నాటక కళా పరిషత్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా టీచర్లు, బోధనేతర సిబ్బంది, రైతులకు, రైతు కార్మికులకు ఏ చిన్న కష్టం వచ్చినా కచ్చితంగా ముందుంటానన్నారు. వీరవాసరం మండలంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ సేవా ట్రస్ట్ సభ్యులు కోరడంతో శాసనమండలిలో చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ నాటక కళా పరిషత్, సేవా ట్రస్ట్ కమిటీ కెఎస్ఆర్కె తోట విజయ్ కుమార్ (బుజ్జి), దేవి రెడ్డి పుల్లారావు, కండిబోయిన నాగ మునీశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో విఫలం

మృతులు, గాయపడిన కుటుంబాలకు సిపిఎం పరామర్శ

సత్యనారాయణను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఇటీవల మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం విమర్శించారు. ఇటీవల ఉపాధి కార్మికులపైకి వ్యాను దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన గుబ్బల మాణిక్యాలరావు, గంగాదేవి, కడలి పావని కుటుంబ సభ్యులను, ఈ ప్రమాదంలో గాయపడిన గుడాల సత్యనారాయణను సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్, కార్యవర్గ సభ్యులు పెద్దిరాజు, నాయకులు ఆదూరి సాంబమూర్తితో కలిసి బలరాం సుబ్రహ్మణ్యేశ్వరం (నక్కవారిపాలెం) వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రమాదంలో గాయపడిన మాణిక్యాలరావును నరసాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుండి భీమవరం, అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరులోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లడానికి, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిన మాణిక్యాలరావు మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడానికి కలిపి సుమారు రూ.85,000 అయ్యిందని తెలిపారు. కూలి పనులు చేసుకునే బాధిత కుటుంబ సభ్యులు ఈ ఖర్చు భరించడం చాలా బాధాకరమన్నారు. అదే ప్రమాదంలో గాయపడిన సత్యనారాయణకు కుటుంబ సభ్యులు లక్షలు రూపాయలు వెచ్చించి వైద్యం అందించారని, బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కూలి పనులు చేసుకునే వారు లక్షలాది రూపాయలు ఎలా వెచ్చిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గాయపడి మంచానపడ్డ సత్యనారాయణ కుటుంబ సభ్యులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

24 నుంచి చైతన్య భారతి జాతీయస్థాయి నాటక పోటీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో భీమవరంలోని డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో చైతన్య భారతి 18వ జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, కార్యదర్శి మంతెన రామకుమార్ రాజు, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు (బిఎస్ఆర్) తెలిపారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ముందుగా బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఈ నాటక పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 27న ముగింపు కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. 24న సినీ నటులు, రచయిత మిశ్రోకు చుక్కన సత్యనారాయణ రాజు రంగస్థల చైతన్య పురస్కారం, నటీమణి మణిబాలకు పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారం, సినీనటులు రావు రమేష్‌కు ఆత్మీయ చైతన్య పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. 27న రంగస్థల నటులు బాలాజీ నాయక్‌కు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారం, చవాకుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్ర మూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, సినీ దర్శకులు వివేక్ ఆత్రేయ కు ఆత్మీయ సత్కారం జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, బొండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, చెరకుపల్లి రవి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఊతం ఉత్తిదే..!

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అమలుకు నోచని 15 రోజులకు వేతనం

పనులు చేసి 120 రోజులైనా అందని వేతనాలు

జిల్లాలో పేరుకుపోయిన రూ.25 కోట్ల బకాయిలు

పని ప్రదేశాల్లో చనిపోతే ప్రభుత్వ సాయం అరకొరే

నేడు కలెక్టరేట్ వద్ద వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఒకపక్క పూర్తిస్థాయిలో పనులు కల్పించరు. మరోపక్క చేసిన పనికి వేతనాలు ఇవ్వరు. ప్రమాదవశాత్తూ పని ప్రదేశంలో చనిపోతే అందించే సాయం కూడా అరకొరే. ఇంకో పక్క యాప్‌ల భారం, రాజకీయ వేధింపులు ఇలా చెప్పుకుంటూపోతే ఉపాధి కూలీలు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేతన బకాయిలు చెల్లించాలని, పని దినాలు, వేతనాలు పెంచాలని, యాప్ ద్వారా మస్టర్ విధానాన్ని తొలగించాలని, సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించేందుకు కూలీలు సన్నద్ధమయ్యారు.

జిల్లాలో 2,94,028 మంది కూలీలు ఉన్నారు. సుమారు 1,78,363 జాబ్ కార్డులు ఉన్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి కొంతమందికి, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ చేసిన పనులకు కనీస వేతనాలు అందించలేదు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే చేసిన పనులకు 15 రోజుల్లో వేతనాలివ్వాలని చట్టం చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. కింద స్థాయిలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో రూ.25,42,80,973 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు తగ్గించారు. ఇటీవల కాలంలో కూలీలపై పనిభారం మరింత పెరిగింది. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ విధానం వల్ల పనిచేయడం ఒక భాగం అయితే కూలీలు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పని ప్రాంతంలో నామమాత్రంగానే సౌకర్యాలు కల్పిస్తున్నారు. పంట, మురుగు కాలవల్లో గుర్రపుడెక్క, తూడు, చెత్త తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు నామమాత్రంగానే కల్పిస్తున్నారు.

జిల్లాలో ఏ పార్టీ అధికారంలో ఉంటే సంబంధిత నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై రాజకీయ ఒత్తిడులు తెచ్చి వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో చట్టం నిర్వీర్యం అయిపోతోంది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో జిల్లాలో పని దినాలు రాను రాను తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వంద రోజులు కూడా పని కల్పించలేని పరిస్థితి ఉంది. అయితే దీన్ని 200లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. పనిచేసినప్పటికీ అరకొరగానే వేతనాలు ఇస్తున్న పరిస్థితి. ప్రభుత్వం రూ.307 కనీస వేతనం అందించాలని చెబుతున్నప్పటికీ రూ.600 పెంచాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇదిలాఉంటే పని చేసే ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. విషసర్పాలు, తేనె టీగలు, తాగి పడేసిన మద్యం బాటిల్స్ గాజు పెంకుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్న వారు అనేకమంది ఉన్నారు. అయితే వీరికి అరకొరగానే వైద్య సేవలు అందజేస్తున్నారు. వారి జీవన స్థితిగతులు అధ్వానంగా మారుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ (ఫైల్‌ఫోటో)

మూడు నెలలైనా వేతనాలు రాలేదు ★ ★ ★

తిరుమాని వీర వెంకట సత్యనారాయణ, వేములదీవి తూర్పు

పనులు చేస్తే రోజులు గడిచాయి. అడుగుతున్న అదిగో ఇదిగో అంటున్నారు. ఇప్పటికి మూడు నెలలైంది. 15 రోజుల్లో వేతనాలు ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ దాని ఊసే లేదు. చట్టం ఉన్నా అమలు కావట్లేదు. మూడు నెలల నుంచి డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలి. ఆలోచించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

ప్రమాదకరంగా పని ప్రదేశాలు.. ★ ★ ★

కొల్లు రత్నం, వేములదీవి తూర్పు

పని ప్రదేశాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా పనులు చేస్తున్నాం. విషసర్పాలు. విషపు తేనెటీగల దాడికి తరచూ గురవుతున్నాం. గాజు పెంకులతో గాయాలవుతున్నాయి. వడగాల్పులు వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న కొంతమంది పనులు చేయడం లేదని మాట్లాడడం సరికాదు. పని ప్రాంతంలో సౌకర్యాలు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలి.

కిలో మీటర్ల మేర నడవాల్సి వస్తోంది ★ ★ ★

జుత్తిగ కుమారి, కేశవరం

ఫొటోల ద్వారా మస్టర్ వేయడం, పని చేయడం ఒక భాగం అయితే ఫొటో దిగడానికి అనేక కిలోమీటర్లు నడవడం పెద్ద భారంగా మారింది. దీనికితోడు చేసిన పనికి డబ్బులు వెంటనే అందించడం లేదు. బతకడం చాలా కష్టంగా ఉంటుంది. పనులు చేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ డబ్బులు వేయడంలో అధికారులకు ఉండడం లేదు. ఇది సరికాదు.

రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి ★ ★ ★

కవురు పుష్పావతి, మునమర్రు

వ్యవసాయ పనులు సరిగ్గా ఉండడం లేదు. ఉపాధి పనులు సక్రమంగా చూపించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూలీల బతుకులు కష్టంగా మారుతున్నాయి. ఉపాధి పనులు 100 నుంచి 200 రోజులకు పెంచాలి. రోజుకు రూ.600 వేతనం చెల్లించాలి. పెరిగిన ఖర్చులకు అందిస్తున్న వేతనాలకు పొంతన ఉండడం లేదు. ప్రభుత్వం ఆలోచన చేసి వేతనాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

బకాయిలు విడుదల చేశారు ★ ★ ★



జక్కంశెట్టి సత్యనారాయణ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి

ముఖ్యమంత్రి విజన్-2047 అని గొప్పలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి ఉపాధి కూలీల సమస్యలు పట్టడం లేదు. జిల్లాలో 723386 పనిదినాలకు రూ.25.42 కోట్ల వేతన బకాయి ఉంది. తక్షణం వీటిని విడుదల చేయాలి. ఉపాధి పని చేసిన 15 రోజుల్లో వేతనాలు ఇవ్వకపోతే వడ్డీతో సహా చెల్లించాలని చట్టం చెబుతోంది. పనిచేసి సుమారు 120 రోజులు గడుస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బతుకుతారు. పాలకులు కనీసం పట్టించుకోకపోవడం దారుణం.

అర్జీలపై జవాబుదారీతనం ఉండాలి : జెసి

భీమవరం : అర్జీల విషయంలో మరింత జవాబుదారితనం కలిగి ఉండాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్లో సోమవారం ఆయన ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంకు తీసుకున్న చర్యలు, రీ ఓపెన్ అయిన అర్జీలు పరిష్కారంకు తీసుకున్న చర్యలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వెబ్ ఎక్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, రీ ఓపెన్ కేసులు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టి పరిష్కరించాలన్నారు. జిల్లాలో 927 ఫిర్యాదులు రీఓపెన్ కాగా 821 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని, ఇంకా 106 పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, డిపిఒ అరుణశ్రీ, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివ రాంప్రసాద్, డిఎస్ఒ సరోజ, డిఆర్డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారి జి.పిచ్చయ్య, జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ టీం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పెనుమంట్ర :** తమ వ్యవసాయ భూమికి పంట నీరు అందించాలని పెనుమంట్ర తహశీల్దార్ వై.రవికుమార్‌ను మండలం లోని నెలమూరు గ్రామానికి చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తమ భూమికి పంట నీరు అందక పోవడం వల్ల పంట నష్టం జరుగుతుందన్నారు. తక్షణమే ఇరిగేషన్ అధికారులు పరిశీలనకు వచ్చి తమ సర్వే నెంబర్ 10/2 గల భూమికి ఫీల్డ్ ప్రకారం బోదె విడిగొట్టి మా పంట పొలానికి నీరు రాకపోకలకు అంతరాయం కలుకుండా చూడవలసిందిగా కోరారు. దీనికి తహశీల్దార్ స్పందించి ఇరిగేషన్ అధికారులను పంపడం జరుగుతుందని, వారు చూస్తారని చెప్పారు. **తాడేపల్లిగూడెం :** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తాడేపల్లిగూడెం పట్టణానికి సంబంధించి 11 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి -4, ఇంజనీరింగ్ విభాగానికి -3, రెవెన్యూ విభాగానికి -2, పింఛన్, రైస్ కార్డులకు సంబంధించి 2 అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. **నరసాపురం :** పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆర్డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 42 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. **పెనుమంట్ర :** మండల కేంద్రం పెనుమంట్రలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు కేవలం నాలుగు ఫిర్యాదులు మాత్రమే అందాయి. మండల తహశీల్దార్ వై.రవికుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి అడబాల జ్యోతిశ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎండలు విపరీతంగా ఉండడం వల్ల ఫిర్యాదుదారులు రాలేక పోయి ఉంటారని తహశీల్దార్ తెలిపారు.

'మానవతా వాది అన్సారీ'

భీమవరం టౌన్ : మంచి మనిషి, మానవతా వాది, ప్రముఖ సంఘ సేవకులు మహ్మద్ అల్లాఉద్దీన్ అన్సారి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సోమవారం జరిగిన ఆయన వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలరాం మాట్లాడుతూ అన్సారి మరణం చాలా బాధాకరం, ఆయనలేనిలోటు తీరనిది అన్నారు. మైనార్టీలు, ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. అన్సారికి ప్రజలందరి తరఫున జోహార్లు, నివాళులు అర్పించారు.

భూమిని రక్షించేందుకు మొక్కలు నాటాలి

యువజన కోఆర్డినేటర్ డాక్టర్ సూరిబాబు

కాళ్ల : పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించి భూమిని కాపాడేందుకు చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని యువజన కోఆర్డినేటర్ డాక్టర్ జి.సూరిబాబు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కాళ్లకూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీగా ఉన్న ప్రతి చోట మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం ఖాళీ ప్రదేశాల్లో వేసేందుకు విత్తనాలు కూడా విద్యార్థులకు అందించారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి.మహేష్ గణేష్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.భాష, హెచ్ఎం బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ అండగా ఉంటాం

బాధితురాలికి ప్రమాద బీమా సొమ్ము అందించిన ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : అధైర్య పడొద్దు ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, కుటుంబంలో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రమాద బీమా ఉపయోగపడుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. పట్టణానికి చెందిన గొల్ల శ్యామల ఇటీవలే మరణించారు. ఆ కుటుంబానికి టిడిపి ప్రమాద బీమా కింద రూ.5 లక్షలను బాధితురాలు దుర్గకు సోమవారం అందించారు. బాధితులకు టిడిపి నుంచి ఇన్సూరెన్స్ డబ్బు తీసుకురావడంలో కృషిచేసిన ఉప్పులూరి చంద్రశేఖర్(రజక కార్పొరేషన్ డైరెక్టర్), జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ ఇరువురిని ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు.

ప్రజల భాగస్వామ్యంతో దోమలకు అడ్డుకట్ట

మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం : ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చునని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు పేర్కొన్నారు. కడకట్ల, వీకర్స్ కాలనీ పిహెచ్‌సి పరిధిలోని 1, 2, 32, 33, 35 వార్డులలో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే డ్రై డే వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల అమలును సోమవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టుటలో ప్రజల భాగస్వామ్యం అవసరమని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు మల్లిక, జ్యోతి, నిర్మలజ్యోతి, వెంకటలక్ష్మి, కెంపురాజు, కృపమ్మ, దుర్గాదేవి పాల్గొన్నారు.

విద్యార్థినికి లాప్‌టాప్ అందజేత

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి ఆధ్వర్యంలో సంఘ సేవా కార్యక్రమాల్లో భాగంగా సభ్యులు అక్కిన బాపిరెడ్డి వారి ఆర్థిక సహకారంతో హైదరాబాద్ ఎయిర్ ఇనిస్టిట్యూట్‌లో బిఎస్సి కంప్యూటర్స్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హర్షితకు రూ.25 వేల విలువ చేసే లాప్‌టాప్‌ను అందజేశారు. అనంతరం డాక్టర్ కెవి.రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ అమెరికా సంస్థ వారి ఆర్థిక సహకారంతో రూ.5 వేల విలువ చేసే వికలాంగుల చక్రాల కుర్చీని అబ్బిరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్, ఉపాధ్యక్షులు నల్లజర్ల వెంకన్న, భారతీకాశ్యప్, కార్యదర్శి జిఎస్ఎన్ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

2,971 టన్నుల రబీ ధాన్యం కొనుగోలు

వ్యవసాయ అధికారి అడబాల జ్యోతిశ్రీ

పెనుమంట్ర : మండలంలో సోమవారం నాటికి రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా రైతు సేవా కేంద్రాల ద్వారా 2,971 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారిణి అడబాల జ్యోతిశ్రీ తెలిపారు. 182 మంది రైతుల నుంచి మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ధాన్యం సేకరణ జరిగిందన్నారు. ప్రస్తుతం అన్ని చోట్ల ధాన్యం మాసూళ్ళు వేగంగా జరుగుతున్నాయని, రైతులకు అవసరం మేరకు మండలంలోని అన్ని ఆర్ఎస్‌కెలలో గోనె సంచులు కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

సుధీర్‌రెడ్డికి సత్కారం

పెనుమంట్ర : మండలంలోని జుత్తిగ గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి కుమారుడు సాయి సుదీర్ రెడ్డి ఇటీవల ప్రకటించిన గ్రూప్-2 పరీక్షలలో ఉత్తీర్ణుడవ్వగా సోమవారం కస్టమ్స్ డిపార్ట్మెంట్లో కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం ఇస్తూ ఆ శాఖ నుంచి ఆర్డర్ అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు అల్లం భాస్కరరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, ప్రముఖులు సుధీర్ రెడ్డిని, ఆయన తల్లి దండ్రులను వారి గృహంలో ఘనంగా సత్కరించారు.

దళితులను అవమానపరచిన వారిని శిక్షించాలి

నరసాపురం : దళితలను అవమాన పరిచి గ్రామ బహిష్కరణ చేసిన అగ్రకులస్తులను కఠిన శిక్షించాలని నరసాపురం నియోజకవర్గ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం నరసాపురం పట్టణంలో పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసిన ఆ గ్రామ అగ్రకులస్తులపైన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళితులకు న్యాయం చేయాలని నిరసన చేశారు. తొలుతగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కలుగచేసుకుని దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కాళ్ల : జిల్లాలో పనిచేస్తున్న భవననిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు సోమవారం తెలిపారు. ఈమేరకు ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ఎపి బిల్డింగ్, అథర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ పట్టణాల అభివృద్ధికి కృషిచేస్తున్న నిర్మాణ కర్తలైన భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా భవననిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ఎన్‌సిసి ఆధ్వర్యాన డోర్ టు డోర్ క్యాంపెయిన్

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను, విద్యాసామర్థ్యాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేసి నాణ్యమైన విద్యను తమ పిల్లలకు అందజేయడానికి ప్రభుత్వ పాఠశాలనే వినియోగించుకోవాలని కోరుతూ 19వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి విభాగానికి చెందిన 50 మంది విద్యార్థులు సోమవారం పట్టణంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పేరెంట్స్ కమిటీ కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ కౌన్సిలర్ ఎన్‌వి.సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి ప్రారంభించి సిపాయిపేట, డిఎస్ చెరువు, వికార్స్ కాలనీ, గాంధీబొమ్మ సెంటర్, పాతూరు, శేష్మహల్, సుబ్బారావుపేట పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మైనం సత్యనారాయణ, ఎన్‌సిసి అధికారి కెవి.గణపతి రావు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి: తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను పొందగలరని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాందువ్వ, ఎంపియుపి స్కూల్ హెచ్ఎం పిఎస్ఎన్.రాజు అన్నారు. సోమవారం కలిగొట్ల, పాందువ్వ, ఆరేడు గ్రామాలలో తమ పాఠశాలలో చేర్పించాలని క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విశిష్టతలను తల్లిదండ్రులకు వివరించడంతో తమ పాఠశాలలో చేరేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు ముందుకు వచ్చారన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి రాష్ట్రస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కేపీ పాలెంలో ఉన్న జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఇసి గ్రూపులో గుండబత్తుల శ్వేత 464/500 మార్కులతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ జెవి.నరసింహమూర్తి సోమవారం తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా శ్వేతను అధ్యాపక బృందం సిహెచ్.కృష్ణమోహన్, పి.శ్రీనివాస్ కె.కళాకార్ రాజు, కె.శ్రీనివాస్ బాబు, కె.మంగతాయారు, వై.రవి, కుమారి అభినందించారు.

ప్రపంచ రంగస్థల సంబరాలకు పెదకాపవరం కళాకారుడికి ఆహ్వానం

ఆకివీడు : ప్రపంచ రంగస్థల సంబరాలకు మండలానికి చెందిన రంగస్థల కళాకారులకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఏలూరులో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలలో భాగంగా శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేకం మహోత్సవాల పేరుతో ప్రతిష్టాత్మకంగా ఈ సంవత్సరం మే 10, 11 తేదీలలో ప్రపంచ రంగస్థల సంబరాలు అట్టహాసంగా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాలలో పాల్గొనాల్సిందిగా ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా ఆహ్వానం పంపించిందని మండలంలోని పెద్ద కాపవరం గ్రామానికి చెందిన రంగస్థలం కళాకారుడు గాదిరాజు చిన అప్పలరాజు సోమవారం ఆహ్వానాన్ని విలేకరులకు చూపి విషయం తెలిపారు. తమకు ఆహ్వానం పంపిన కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, ప్రధాన కార్యదర్శి పార్థసారథిలకు కృతజ్ఞతలు తెలిపారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వాడాలి

డాక్టర్ ప్రియదర్శిని

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ లెప్రసీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియదర్శిని సందర్శించారు. డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్‌ను లెప్రసీ కేసుల వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కొత్త కేసులను గుర్తించి వారు మందులు సక్రమంగా వాడేటట్లు చూడాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పిఎంఒ ఎంపి రమేష్, డిపిఎంఒలు జక్కంపూడి రాంప్రసాద్, జివిఎస్ఎన్.మూర్తి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్‌పి ఎలిజిబెత్ పాల్గొన్నారు.

మాంటిస్సోరీస్‌లో మాక్ కన్వకేషన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్లో యుకెజి విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు మాక్ కన్వకేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడ్వకేట్ జివి.సుబ్బారావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరిస్ స్కూల్ గత 35 సవంత్సరాలుగా దినదినాభివృద్ధి చెందుతూ రావడమే కాకుండా విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, విద్యార్థులను మంచి క్రమశిక్షణలో పెడుతూ వారిని ఒక మంచి బాటలో తీసుకుని వెళ్తునారని తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ, కరెస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.వసంత లక్ష్మి పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో ప్రమాదాలు నివారించాలి

విద్యార్థులు, యువకుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

భీమవరం : పేరుపాలెం బీచ్‌లో జరుగుతున్న ప్రమాదాలు నివారించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. విద్యార్థులు, యువకుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. పేరుపాలెం బీచ్‌కి ఎక్కువమంది పర్యాటకులు ఈ కాలంలో పెరిగారన్నారు. జిల్లా విద్యాకేంద్రంగా పెరగడంతో విద్యార్థులు, యువకులు పేరుపాలెం బీచ్‌కి అక్కడున్న ప్రకృతి అందాలను చూసేందుకు, ఆస్వాధించేందుకు, కొందరు భక్తిపరంగా ఆ ప్రాంతానికి వెళ్తున్నారన్నారు. కాని ఇక్కడ ఎటువంటి భద్రతా చర్యలు ప్రభుత్వం చేపట్టడం లేదన్నారు. ఈ కాలంలో ఒకే నెలలో రెండు మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ప్రాణాలు పోతున్నా అధికార యంత్రాంగం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తోందే తప్ప ప్రాణాలు కాపాడే చర్యలు చేపట్టడం లేదన్నారు. పేరుపాలెం బీచ్‌ని పర్యాటక కేంద్రంగా ప్రకటించడమే తప్ప పర్యాటక కేంద్రానికి ఉండాల్సిన యాంత్రాంగంకాని, అందుబాటులో రిస్క్యూటీంని, లైఫ్ సేవింగ్ స్విమ్మింగ్ బోట్స్‌ని ఉంచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆందోళన వ్యక్తం చేశారు.

శాంతి కమిటీతో సమస్య పరిష్కారం కాదు

వివక్ష చూపిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు

భీమవరం : పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళితులపై గ్రామ బహిష్కరణ చేస్తే శాంతి కమిటీ వేసి పరిష్కరించామని ఆర్‌డిఒ ప్రకటించడం అన్యాయమని, కులవివక్ష చూపిన పెద్దలను తక్షణం అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంఎల్ఎగా ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులపై కులవివక్ష, సాంఘిక బహిష్కరణ జరగడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి స్పందించకపోవడం అన్యాయమన్నారు. దళితులపై నేటికి సాంఘిక బహిష్కరణ వంటి ఘటనలు కొనసాగడం దారుణమన్నారు. గతంలో కూడా ఇదే మల్లం గ్రామంలో ఆధిపత్య కులానికి చెందిన వారు అర్ధరాత్రి నిద్రిస్తున్న దళితపేటపై మూకుమ్మడి దాడి చేయగా 23 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నడుస్తుందని గుర్తుచేశారు. అయినా మరలా అదే వర్గం మళ్లీ దళితులను సాంఘిక బహిష్కరణ చేస్తే రాజీ చేశామని ఆర్‌డిఒ ప్రకటించడం అంటే చట్టాలను తుంగలో తొక్కడమే అన్నారు. సాంఘిక బహిష్కరణ జరిగినట్లు ప్రత్యక్షంగా పక్కా ఆధారాలు ఉంటే అధికారులు మాత్రం కేవలం శాంతి కమిటీ పేరుతో పరిష్కారం అయ్యిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఘటనను పక్కదారి పట్టించి రాజీ కుదిర్చిన ఆర్‌డిఒ, అధికారులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, డిఎస్‌పి క్షేత్ర స్థాయి దర్యాప్తు చేసి కుల వివక్ష చూపిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కాలనీలో తాగునీరందించాలి

సిపిఎం ఆధ్వర్యాన ఎంపిడిఒకు వినతి

వినతిని అందజేస్తున్న నాయకులు

కాళ్ల : కాళ్లకూరు గ్రామంలో ప్రభుత్వ కాలనీకి మంచినీళ్ల పైపులు ఇవ్వండని పేద ప్రజలు అధికారులకు మొర పెట్టుకున్నారు. కాళ్లకూరు ప్రభుత్వ కాలనీ ప్రజలు సోమవారం ఎంపిడిఒ జి.స్వాతికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామం వెంకటాపురంలోని ప్రభుత్వ కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఇల్లు నిర్మించుకోమని మంచినీళ్ల పైపులు, రోడ్లు, కరెంటు సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కనీసం తాగడానికి కూడా మంచినీళ్లు ఇవ్వకుండా పేదలు ఎలా నివసిస్తారని ప్రశ్నించారు. వెంటనే తాగడానికి మంచి నీళ్లు ఇచ్చేందుకు పంచాయతీ వారు పైప్ లైన్లు వేసి వీధి కుళాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్తు నిధుల నుంచి పైప్‌లైన్లు వేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే మరోసారి మంచినీళ్ల బిందులతో నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి వినాయక, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రమణకు అత్యుత్తమ సేవా అవార్డు

అవార్డుతో రమణ కుటుంబం

పాలకొల్లు : పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ బివి.రమణకు పాలకొల్లు లయన్స్ క్లబ్ వారు 2024-2025 సంవత్సరానికి అత్యుత్తమ సేవా అవార్డు అందజేశారు. బివి.రమణ ములపర్రులో తన సొంత నిధులతో బివి.రమణ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి కరోనా టైంలో చుట్టుపక్కల పది గ్రామాలకు రెండు నెలలపాటు ఆహారం అందించారు. రూ.పది లక్షల సొంత నిధులతో కైలాస రథం, ఫ్రీజర్ బాక్స్, ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ అందుబాటులో ఉంచారు. ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ముత్యాల హిమ బిందు ఉన్నత చదువు నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా త్వరలో ప్రశాంతి అనాథ ఆశ్రమం కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా బివి.రమణ మాట్లాడుతూ తన గురువుగారైన ఎస్‌వికెపి.పితాని వెంకన్న జూనియర్ కళాశాల ఇంగ్లీషు లెక్చరర్, విశ్రాంత ప్రిన్సిపల్ డి.చిన హనుమంతరావు(హెచ్ఆర్) సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అత్యుత్తమ సేవా అవార్డు రావడంపై పాలకొల్లు సహజ జిల్లా అగ్నిమాపక అధికారి వైవి.జానకిరామ్, ఫైర్ సిబ్బంది, డిసిహెచ్.హనుమంతరావు, పాలకొల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జయ భరతా రెడ్డి అభినందనలు తెలిపారు.

పలుచోట్ల గర్భిణులకు సీమంతం

తణుకులో సీమంతంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ

వీరవాసరం : గర్భిణులు తాము తీసుకున్న పోషకాహారం ద్వారానే ఆరోగ్యకరమైన బిడ్డను జన్మనిస్తారని ఎంపిపి వీరవల్లి దుర్గభవాని అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచి శిఖరం మంగతాయారు, తహశీల్దార్ రామాంజనేయులు, ఎంపిడిఒ అప్పారావు, ఎంపిటిసి గుడిపల్లి విజయలక్ష్మి, ఐసిడిఎస్ కుశ కోడేరు ప్రాజెక్టు అధికారిని లక్ష్మీకాంతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటూ తమతో పాటు తమ బిడ్డ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండా రామకృష్ణ, సరోజినీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **తణుకు :** గర్భిణీల్లో రక్తహీనత లేకుండా ప్రభుత్వం అందించే పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం ప్రణాళికా బద్ధంగా తీసుకుని తల్లిబిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తణుకు మున్సిపల్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఐసిడిఎస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **పెనుమంట్ర :** ప్రతీ అంగన్వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతల, బాలల ఆరోగ్యం కోసం అందరూ కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సోమవారం మండలంలోని జుత్తిగ, వెలగలేరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పెనుగొండ :** పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సర్పంచి పాల్గొని మాట్లాడుతూ బాలింతలు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని, దీని ద్వారా రక్తహీనత కాపాడవచ్చునని అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎ.కృష్ణకుమారి, సుజాత, రూతు కుమారి, మహిళా పోలీస్, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నేడు ధర్నా

యలమంచిలిలో..

నరసాపురం : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు మూడు నెలల వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ సోమవారం సరిపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ చట్టంలో ఉందన్నారు. అయితే మూడు నెలలు దాటినా ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడం కూలీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తెలియజేస్తుందని అన్నారు. ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, సిర్రా ఝాన్సీ, పిట్టా రాంబాబు, పిల్లే సువర్ణ రాజు, పలివెల శాంతకుమారి పాల్గొన్నారు. **తణుకు రూరల్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధి హామీని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఊపిరి తీయాలనే ఆలోచన మానుకోవాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. అత్తిలి మండలం పాలూరు గ్రామంలో రాసకోడు వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి ఆరా తీశారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాపేటి వెంకట సింహాచలం, మల్లపు సంతోష్ కుమార్, కోడెల వెంకట విజయకుమారి, మల్లపు పార్వతి పాల్గొన్నారు. **యలమంచిలి :** ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మేడపాడు, ఆర్య పేట, యలమంచిలి, కట్టుపాలెం, ఇలపకుర్రు, దొడ్డిపట్ల, కాంబోట్లపాలెం తదితర గ్రామాలలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధి హామీ మేట్లు పాల్గొన్నారు. **పెనుమంట్ర :** గత రెండు నెలలుగా ఉపాధి హామీ పనులు చేసిన గ్రామీణ కార్మికులకు రావలిసిన డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయకపోవడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. సోమవారం మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామంలో సమావేశమైన కార్మికులతో ఆయన మాట్లాడారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కోడే ప్రసాద్, డి.రామారావు, ఎం.ధర్మారావు, టి.అనూష, నాగలక్ష్మి, పి.దుర్గా, ఎం.సుబ్బలక్ష్మి, డి.సత్యలక్ష్మి, ఇ.కనకరత్నం, ఎం.కళ్యాణి, వి.ధనలక్ష్మి, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

వినతిని అందజేస్తున్న నాయకులు

పెనుగొండ : అతి తక్కువ వేతనంతో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు, పాఠశాల ఆయాలకు కనీస వేతనం నెలకు రూ.26 వేల చొప్పున ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు, పాఠశాల ఆయాలు పెనుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్ట్

11 వాహనాలు స్వాధీనం

తణుకు రూరల్ : రాత్రిపూట ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉంచిన మోటారు సైకిళ్లను అపహరించుకుపోతున్న ముగ్గురు అంతరాష్ట్ర ముఠా సభ్యులను సోమవారం తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణా రాష్ట్రంలోని జీడిమెట్ల, సూరారం, కూకట్‌పల్లి పోలీసు స్టేషన్లతోపాటు జిల్లాలోని తణుకు రూరల్, పోడూరు, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన బైక్ చోరీల్లో మొత్తం 11 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్, తణుకు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్‌లు తణుకు రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం జీడిమెట్లకు చెందిన దాసరి మణిబాబు, తణుకు పాతవూరుకు చెందిన గుడాల లక్ష్మీనారాయణ అలియాస్ లక్కీ, తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన బొంత రవితేజలు బృందంగా ఏర్పడి మోటారు సైకిళ్లను అపహరించుకుపోతున్నారు. ఈక్రమంలో ఇటీవలి కాలంలో తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన మూడు బైక్ చోరీ కేసుల్లో విచారిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న లక్ష్మీనారాయణ, రవితేజలను అదుపులోకి తీసుకోవడంతో మొత్తం వ్యవహారం బట్టబయలైంది. కేవలం బుల్లెట్ వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల విలువ రూ.13.40 లక్షలు ఉంటుందని డిఎస్‌పి తెలిపారు. రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపించిన తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్, ఎఎస్ఐ పి.సంగీతరావు, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు ఎస్‌కె.అన్వర్, ఎం.శ్రీనివాస్, వి.మాధవరావు, ఎస్.భాస్కరాచారిలను తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్, సిఐ కృష్ణకుమార్‌లు అభినందించారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు, ఇరగవరం కాలనీకి చెందిన దాకె కస్తూరి అను నాయొక్క **పాస్ పోర్ట్ నెం. W8092972** గల పాస్ పోర్ట్ ఇరగవరం రోడ్డు కాలనీలో ఇల్లు మారుతుండగా మార్గమధ్యలో నా పాస్‌పోర్ట్ పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

దాకె కస్తూరి
W/o. గంగరాజు
D.No. 3-4-11, తోట వారి వీధి,
ఇరగవరం రోడ్డు కాలనీ
తణుకు - 534211
Cell No: 74168 25170

దస్తావేజులు పోయినది

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జువ్వలపాలెం గ్రామ కాపురస్థులు బాలం నాగేశ్వరరావు గారి కుమారుడు బాలం నాగరాజు నాకు ఇచ్చిన సంజాయిషి ప్రకారం:

నా క్లయింటు తన తండ్రిగారు అయిన బాలం నాగేశ్వరరావు ద్వారా స్థిరాస్థి దఖలు దస్తావేజు తేది. 11-04-2025, **Doc. No. 4409/2025** T.P.G S.R.O. ద్వారా తాడేపల్లిగూడెం మండలం, రామన్నగూడెం గ్రామ పంచాయితీలోని **R.S.No. 83** లోని చ.గ.**293.5** గలలోని డోర్ నెం: 1-23 గల **R.C.C. Building** పొందియున్నారు. కొన్నిరోజుల క్రితం అనగా ది. 18-04-2025 తేదిన అవసరం నిమిత్తం తెలిపిన స్థలం యొక్క దస్తావేజులు లింకు దస్తావేజులు **Doc. No. 3974/2007** మరియు **5816/2011** **T.P.G SRO** లను తాడేపల్లిగూడెం తీసుకొని పోవుచుండగా దారి మధ్యలో కోల్పోయారు. కావున ఆ పత్రము ఎవరికైన దొరికిన యెడల అందజేయగలరు.

పమ్మి వి నాగ వీరభద్రుడు
అడ్వకేటు
తాడేపల్లిగూడెం

PUBLIC NOTICE

This public Notice to given. on behalf of my client **Balam Naga raju** S/o Nageswara Rao R/o Ramannagudem, Tadepalligudem (M), W.G. as follows:

My client lost the link Document of Regd. Gift deed **Doc. No. 4409/2025** i.e. Regd. Settlement deed **5816/2011** of Tadepalligudem S.R.O. and Regd. Sale ded **DOC-No.3974/2007** of Tadepalligadam S.R.O while he was travelling to Tadepalligidem regarding the RCC Building with in extent of sq. **293.5** yards in house site in **R.S.No.83** bearing D.No.1-23. Therefore this public Notice is issued to to all that any body was in possesion of said documents they shall come forward with documentary proof within **3 days** from date of this notice to under signed else of shall seemed that they are no claims oro objections over the scheduled property and transaction will ble proceed with

P.V.N.Veera Bhadrudu
Advocate
Tadepalligudem
Cell:77023 11197

పురపాలక సంఘ కార్యాలయం, తణుకు

ఆర్.ఒ.సి. నెం.4037/2014-ఎ1 తేది.21-04-2025

టెండర్ కం-బహిరంగ వేలం నోటీసు (మూడవ పిలుపు)

తణుకు పురపాలక సంఘమునకు చెందిన **శ్రీ మహాత్మా జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే సామాజిక భవనము** నెలకు రూ. 27,000/- నెలసరి అద్దె విలువ పై 3 సంవత్సరముల కాలమునకు లీజుకిచ్చుటకు గాను ది. 28-04-2025వ తేది ఉదయం గం॥ 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనరు వారిచే గాని, వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని టెండరు కం- బహిరంగ వేలం నిర్వహించబడును.

వ. నెం.	భవనముల లీజుకు	ప్రతిపాదించిన నెల ఒక్కింటికి అద్దె రూ.	డిపోజిట్ రూ.	సాల్వన్సీ రూ.	టెండరు షెడ్యూలు రూ.
1	శ్రీ మహాత్మా జ్యోతిరావ్ గోవిందరావ్ పూలే సామాజిక భవనము	27,000/-	1,00,000/-	2,00,000/-	200/-

పై భవనము లీజుకు టెండరు
షెడ్యూలు కొనుగోలు ఆఖరి తేది: 25/04/2025
టెండరు షెడ్యూలు జారీ చేయు తేది: 26/04/2025
టెండరు దాఖలు చేయు ఆఖరు తేది: 26/04/2025 సాయంత్రం గం. 4.00 ల వరకు.

టెండరు కం బహిరంగ వేలం లో పాల్గొను వారు టెండరు రేటు నెలసరి అద్దె విలువలతో టెండరు రేటు దాఖలు చేయవలెను. టెండరు షెడ్యూలు లో పాటు డిపాజిట్టు (డి.డి. ద్వారా) మరియు సాల్వేన్సీ దాఖలు చేయవలెను.

బహిరంగ వేలం అనంతరము టెండరుదారులు మరియు పాట దారుల సమక్షములో బహిరంగ వేలం అనంతరము టెండర్లు తెరువబడును. బహిరంగ వేలము లేక టెండర్లు లో దాఖలైన హెచ్చు పాటదారుల అద్దె విలువలు ఖరారు చేయు విషయములో కౌన్సిలు వారి నిర్ణయము కొరకు ఉంచబడును.

ఏకారణము చూపకనే టెండరు కం బహిరంగ వేలమును వాయిదా వేయుట లేక రద్దు పరచు హక్కు కమీషనరు లేక కౌన్సిలు వారు పూర్తి అధికారం కలిగి యున్నారు.

ఇతరవిషయములు వివరములు కార్యాలయ పని వేళలో రెవిన్యూ విభాగములో తెలుసుకొనగును.

సం/- **కమీషనర్,** తణుకు పురపాలక సంఘం